క్లుప్తంగా

గ్రామసభకు 80అర్జీలు

గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు):భూముల రీసర్వేకు సంబంధించి గురువారం స్థానిక గ్రామసచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు పలుసమస్యలను దరఖాస్తుల రూపంలో అధికారులకు అందజేశారు. సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు. సభలో భూముల విస్తీర్ణాలకు సంబంధించి, జాయింట్ ఎల్పీ నంబర్లు ఉన్న భూములు, విస్తీర్ణం కొలతలు తేడాలకు సంబంధించి 80 అర్జీలు వచ్చాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ సక్కా కమల, భూముల సర్వే ఏడీ త్రివిక్రమ్, డీఐ వెంకటస్వామి, తహసీల్దార్ శాంతిలక్ష్మి, మండల సర్వేయర్ స్వప్న వీఆర్వో రమణ, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: అనారోగ్యానికి గురైన పేదవారికి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద అందిస్తున్న ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. ఈ సందర్భంగా పేట పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన పదిమందికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.5.75లక్షల విలువగల నగదు చెక్కులను ఆయన పంపిణీ చేశారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞలు తెలియజేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: మండలంలోని మోగులూరు గ్రామానికి చెందిన సుకాసి చందనకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.3లక్షల విలువగల చెక్కును కంచికచర్ల ఓసీ క్లబ్ వద్ద ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గురువారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామసభ నిర్వహణ

జగ్గయ్యపేట: రైతులు భూసర్వేలో తప్పులుంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని సర్వేయర్ అనూష్ సూచించారు. మండలంలోని షేర్‌మహ్మద్‌పేట శివారు గ్రామం రావికంపాడులో గురువారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాదార్ పాస్‌పుస్తకాలలో తప్పులున్నా, సర్వే హద్దుల్లో తేడాలున్నా, అడంగళ్‌లో తప్పులున్నా అర్జీలు అందజేయాలని గ్రామస్తులను కోరారు. ఆయా రెవెన్యూ సమస్యల పరిష్కారం కోరుతూ ఐదుగురు గ్రామస్తులు అధికారులకు అర్జీలు అందజేశారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల వేలం వాయిదా

నందిగామ టౌన్: మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో గురువారం జరగాల్సిన టెండర్ కం బహిరంగ వేలం పాటలను వాయిదా వేసినట్లు ఈవో హరిగోపీనాథ్ తెలిపారు. ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజా సామగ్రి, నిమ్మకాయల విక్రయం, అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్ల సేకరణ హక్కుల వేలానికి పాటదారులు ఆసక్తిచూపని కారణంగా ఈ వేలంను వాయిదా వేసినట్లు వివరించారు.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠ



వత్సవాయి :స్థానిక సాయిబాబా మందిరంలో సాయిబాబా విగ్రహాన్ని గురువారం పునఃప్రతిష్ఠించారు. ఆలయ నిర్మాణ ధర్మకర్త యెగానంద కృష్ణమూర్తి, ఎర్రవరం బాల ఉగ్రనరసింహ స్వామివారి ఆలయ చైర్మన్ నలజాల జగన్నాథం చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు పరాశరం రామకృష్ణమాచార్యులు ఆధర్యంలో వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూలజు చేశారు. హైదరాబాద్‌కు చెందిన గుత్తా కృష్ణమూర్తి దంపతులు సాయిబాబా విగ్రహాన్ని సమకూర్చగా, అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఓటు నమోదు చేసుకోవాలి :ఎమ్మెల్యే

నందిగామ టౌన్: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి అర్హులైనవారంతా వెంటనే ఓటుహక్కును నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించేందుకు స్థానిక గాంధీ సెంటరులో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబరు ఆరులోగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని పట్టభద్రులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

కంచికచర్ల: అక్రమంగా ఇసుకను తరలించేవారిపై కేసు నమోదు చేయడంతోపాటు వాహనాన్ని సీజ్ చేస్తామని ఎస్ఐ బోనగిరి రాజు హెచ్చరించారు. కంచికచర్లలో డంపింగ్ చేసిన ఇసుకను అక్రమంగా తెలంగాణకు తరలిస్తున్న ఓ లారీని బుధవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టాలున్నా...ఆక్రమణలంటూ నోటీసులు

- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే అక్కస్సే కారణం
- ఆందోళనలో భవనాల యజమానులు

భవనాలను కూల్చేందుకు పాలకుల కుట్ర



మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేసిన రామన్నపేటరోడ్డులోని వ్యాపార సముదాయాలు ఇవే

నందిగామ టౌన్: నిన్నమొన్నటివరకు దాడులకు పాల్పడుతూ అక్రమకేసులు బనాయిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసిన టీడీపీ పాలకులు...ఈసారి రూట్‌మార్చి అభివృద్ధి పేరుతో ప్రజల ఆస్తులను నేలకూల్చేందుకు సిద్ధమవుతున్నారు. అందుకు తాజాగా నందిగామ గాంధీసెంటర్‌లోని రామన్నపేట రోడ్డులో 40ఏళ్లగా వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేయడమే ఇందుకు నిదర్శనం. దీంతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

20ఏళ్ల కిందట పట్టాలు జారీ..

వ్యాపార సముదాయంగా పేరుగాంచి నందిగామకే తలమానికంగా ఉన్న గాంధీసెంటరులోని రామన్నపేట రోడ్డులో పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన దాదాపు 50మందికిపైగా ఉంటున్నారు. వీరంతా వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 20ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వం వీరికి రెండు సెంట్ల చొప్పున భూమిని కేటాయిస్తూ పట్టాలు సైతం అందించింది. దీంతో వారంతా ఇళ్లు నిర్మించుకుని చిన్న, చిన్న వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకుని వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ పట్టాల స్థలాలను అనంతరం ప్రభుత్వం విడుదల చేసిన జీవోలకు అనుగుణంగా కన్వర్షన్ డీడ్ (తహసీల్దార్‌తో రిజిష్టరు చేయడం) కూడా చేయడంతో ఆర్థిక అవసరాల నిమిత్తం కొందరు విక్రయించగా కొనుగోలుచేసిన వారు ఆర్‌సీసీ భవనాలు నిర్మించుకున్నారు.

రోడ్డు విస్తరణ పేరుతో..

ఈ రామన్నపేట రోడ్డు ప్రస్తుతం 80అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఈ రోడ్డును మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ కుమార్ అభివృద్ధి చేశారు. అధికారులతో సర్వే చేయించి మరీ రోడ్డును అభివృద్ధి చేశారు. అయితే తాజాగా రోడ్ల విస్తరణ, డ్రైనేజీ నిర్మాణం పేరుతో ఆయా దుకాణాలు తొలగించేందుకు మున్సిపల్ అధికారులు ఇప్పటికే సుమారు 50మంది దుకాణాల యజమానులకు నోటీసులు జారీచేశారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి మౌఖిక ఆదేశాలతోనే ఈ నోటీసులు జారీచేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. రామన్నపేట రోడ్డులోని వ్యాపార సముదాయాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులకు చెందినవనే అక్కసుతోనే నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఇటువంటి చర్యలకు పూనుకున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గతంలో రాష్ట్రప్రభుత్వం జారీచేసిన పట్టా



రాష్ట్రప్రభుత్వం చేసిన కన్వర్షన్ డీడ్



మున్సిపల్ అధికారులు జారీచేసిన నోటీసు

మద్యం షాపు తరలింపు..

అభివృద్ధి పేరుతో మున్సిపల్ అధికారుల ద్వారా ఈ దుకాణాలను కూల్చేందుకు టీడీపీ నేతలు ప్రణాళికలు సిద్ధంచేశారని సమాచారం. గతంలో టీడీపీలో కీలకపాత్ర పోషించిన ఏఎంసీ మాజీ చైర్మన్ చిరుమామిళ్ల శ్రీనివాసరావుకు చెందిన భవనంలో మద్యం షాపు ఏర్పాటు చేశారు. అయితే మద్యంషాపు ప్రారంభించిన ఒక్క రోజులోనే టీడీపీ నేతలు కక్షకట్టి మరీ ఆ షాపును ఖాళీ చేయించారని బాధితులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. దీనికి తోడు మున్సిపల్ అధికారులతో పాత తేదీలతో నోటీసులు అందిస్తూ ఈ భవనాలను ఎలాగైనా కూల్చేందుకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, టీడీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

భవనాలు కూల్చాలనే కుట్ర..



గతేడాది చేసిన రోడ్డు విస్తరణ, అభివృద్ధికి అడ్డురాని షాపులను నేడు అభివృద్ధి పేరుతో ఎమ్మెల్యే సౌమ్య తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారు. మద్యం దుకాణాన్ని అద్దెకు ఇస్తే అద్దెకు తీసుకున్న వారిని సైతం బెదిరించి ఖాళీ చేయించారు. ఇప్పటికైనా కక్ష సాధింపు చర్యలను మానుకోవాలి.

– చిరుమామిళ్ల శ్రీనివాసరావు, బాధితుడు

రోడ్డున పడతాం..



వ్యాపార సముదాయాలపై ఆధారపడి 50కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అభివృద్ధి పేరుతో దుకాణాలను తొలగిస్తే నిరుపేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు రోడ్డున పడతారు. మా దుకాణాలు, నివాసాలకు కనవర్షన్ డీడ్ కూడా ఉంది. వ్యాపార సముదాయాలు కూలదోసే ఆలోచనను విరమించుకోవాలి.

–షేక్ కరిముల్లా, బాధితుడు

వివరాలు తెలుసుకునేందుకే...

నందిగామ పట్టణ అభివృద్ధిలో భాగంగా డ్రైనేజీ ఏర్పాటుకుగాను ప్రభుత్వ భూమి వివరాలు తెలుసుకునే క్రమంలో రామన్నపేట రోడ్డులోని ఆయా భవనాల యజమానులకు నోటీసులు జారీచేశాం. ఆర్‌అండ్‌బీ అధికారుల నుంచి ప్లాన్ తెప్పించాను. పూర్తిస్థాయిలో సర్వే చేసి తదుపరి చర్యలు తీసుకుంటాం.

–రమణబాబు, మున్సిపల్ కమిషనర్

వరద బాధితుల ఆందోళన

- పరిహారం అందజేయాలని డిమాండ్
- రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా
- ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే సౌమ్యల హామీ ఏమైందని ఆవేదన



కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న చెవిటికల్లు గ్రామస్తులు

కంచికచర్ల: గతనెల మొదటివారంలో భారీ వర్షాలు, వరదలకు నీటమునిగిన ఏటిపట్టు గ్రామాల ప్రజలను ఆదుకుంటామంటూ ఎంపీ, ఎమ్మెల్యే ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ వరద బాధితులు డిమాండ్ చేశారు. తమకు వెంటనే పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చెవిటికల్లు గ్రామానికి చెందిన వరద బాధితులు గురువారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా బాధితులు మాట్లాడుతూ భారీ వర్షాలకు పంటపొలాలు నీటిమునగడంతోపాటు ఇళ్లలోకి వరదనీరు చేరిందన్నారు. దీంతో ఇళ్లలో ఉన్న విలువైన వస్తువులు, సామగ్రి నీటికి కొట్టుకుపోయి నష్టపోయామన్నారు. ఇళ్లలో ఉన్న పంట ఉత్పత్తులు, ధాన్యం నిల్వలు తడిచి పోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి కంచికచర్ల మండలంలో ముంపునకు గురయిన గ్రామాలను రీఎన్యూమరేషన్ చేయించి నెలరోజులవుతోందన్నారు. ఏటిపట్టున ఉన్న తొమ్మిది ముంపు గ్రామాల్లో 5,487 ఇళ్లు ముంపుకు గురయ్యాయని రెవెన్యూ అధికారులు నివేదిక అందజేసినప్పటికీ నేటికీ పరిహారం అందకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముంపు గ్రామాల బాధితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు నష్టపరిహారం అందిస్తామన్న ఎంపీ శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే సౌమ్య తమ హామీని నిలబెట్టుకుని ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ వి.జాహ్నవికి వినతిపత్రం అందజేశారు. వరద బాధితుల అభిప్రాయాలు..వాటి మాటల్లోనే..

పరిహారం అందజేయాలి..



భారీవర్షాలకు తీవ్రంగా నష్టపోయాం. కృష్ణానది ఒడ్డున ఉన్న మా చెవిటికల్లుతోపాటు చాలా గ్రామాల్లో వరదనీరు చేరింది. ఇళ్లలోని సామగ్రి, పశుగ్రాసం వరదల్లో కొట్టుకుపోయాయి. నష్టపరిహారం ఇస్తామని నాయకులు, అధికారులు చెప్పారే తప్ప నెలన్నర రోజులుగా ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. వెంటనే నష్టపరిహారం అందజేయాలి.

–కోట ప్రభాకర్, చెవిటికల్లు

ప్రభుత్వం ఆదుకోవాలి..

గతనెలలో కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు మునిగిపోయాయి. ఇళ్లలోకి వరదనీరు చేరడంతో సామగ్రి దెబ్బతింది.అధికారులు మమ్మల్ని పునరావాస కేంద్రానికి తరలించారు. పరిహారం మాత్రం నేటికీ ఇవ్వలేదు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలి..

–పార్వతి, చెవిటికల్లు

బాధిత రైతుల తరపున పోరాడతాం

- ఇసుక మేట తొలగింపునకు రైతులకు ఎకరానికి రూ.లక్ష ఇవ్వాలి
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్



పాతవేమవరం వద్ద ఇసుకమేట వేసిన పొలాలను పరిశీలిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు

పెనుగంచిప్రోలు,వత్సవాయి: సెప్టెంబర్ నెల మొదటి వారంలో మునేరు వరదకు నష్టపోయిన బాధిత రైతులందరినీ ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పెనుగంచిప్రోలు మండలంలోని ముచ్చింతాల, అనిగండ్లపాడు, వత్సవాయి మండలంలోని ఆళ్లూరుపాడు, పాతవేమవరం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. వరద కారణంగా ఇసుక మేట వేసిన పొలాలు, దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఫోన్ ద్వారా అధికారులను సంప్రదించారు. అనంతరం తన్నీరు నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ మునేరు వరదకు తువ్వకాలువ తెగి పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో దాదాపు 1000ఎకరాలకు పైగా వరిపొలాలు ఇసుక మేట వేయడంతోపాటు కోతకు గురయ్యాయన్నారు. ఇసుక మేట తీసుకోవాలంటే రైతులకు సాధ్యపడే విషయం కాదన్నారు. పొలాల్లో 4 నుంచి 5 అడుగుల మేర ఇసుక మేట వేసిందన్నారు. పంట నష్టపోయినందుకు కేవలం ఎకరానికి రూ.10వేలు మాత్రమే ఇచ్చారని, ఇసుక మేట తీసుకునుందుకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ఇసుక మేట తీసుకునేందుకు రైతులకు ఎకరానికి కనీసం రూ.1లక్ష నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు, మంత్రులు కలిసి రైతుల దగ్గరకు వచ్చి పరిశీలించాలన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులు నష్టపోతే ఎంతో పారదర్శకంగా అదే సీజన్‌లో రైతులకు నష్టపరిహారం అందించిన వైనాన్ని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం ఉంటే ఆయా గ్రామాల్లో జరిగిన నష్టం, అందించిన పరిహారం వివరాలతో గ్రామసభలు నిర్వహించాలన్నారు. తువ్వకాలువకు 50చోట్ల వరకు గండ్లు పడినప్పటికీ పాలకులు నేటికీ పట్టించుకోలేదన్నారు.రైతులు గండ్లు పూడ్చకపోతే వర్షాలు పడి మునేరుకు వరద వస్తే పొలాలు మళ్లీ ఇసుక మేటకు గురవుతాయన్నారు. గండ్లు పూడ్చకుండా ఇసుక మేట తీయడం రైతులకు సాధ్యపడదన్నారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌తోపాటు, అధికారులు రైతుల బాధలను పరిగణనలోకి తీసుకుని తక్షణం గండ్లు పూడ్చటంతోపాటు బాధితులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు మార్కపూడి గాంధీ, కె.రమాదేవి, జెడ్పీటీసీ సభ్యులు వూట్ల నాగమణి, ఏసుపోగు దేవమణి, ముచ్చింతాల, సుబ్బాయిగూడెం సర్పంచ్‌లు జక్కులూరి రాంబాబు, పాపినేని వెంకటేశ్వరరావు, మైనింగ్ కార్పొరేషన్ మాజీ డైరక్టర్ బత్తుల రామారావు, ఎస్సీసెల్ నాయకులు కన్నమాల శామ్యూల్, బీసీసెల్ నాయకులు మండవ శ్రీనివాసగౌడ్, శ్రీకనకదుర్గమ్మవారి ఆలయ డైరక్టర్ నంబూరి రవి, ఎంపీటీసీ సభ్యులు కీసర లోకేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు కనగాల రమేష్, చింతకుంట్ల వెంకటరెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, కాటేపల్లి రవికుమార్, సూర్యనారాయణ, నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, ఉన్నం శ్రీనివాసరావు, వూట్ల లక్ష్మయ్య, కోలా రామారావు, కాకాని హరి తదితరులు పాల్గొన్నారు.


వాసిరెడ్డి పద్మ వ్యాఖ్యలు సరికాదు: తన్నీరు




విలేకరులతో మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, పక్కన జెడ్పీటీసీ వూట్ల నాగమణి, ఎంపీపీ ఎం.గాంధీ

పెనుగంచిప్రోలు: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై మహిళా కమీషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. పెనుగంచిప్రోలులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు క్యాబినెట్ హోదా కలిగిన మహిళా కమీషన్ చైర్‌పర్సన్ పదవిలో కొనసాగి ఇప్పుడు ఇలా మాట్లాడటం తగదన్నారు. ఇటీవల జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్తగా తనను నియమించాలని అడిగిన వాసిరెడ్డి పద్మ, ఇంతలోనే పార్టీలో మహిళలకు పార్టీలో ప్రాధాన్యంలేదని వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు. 2014లో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా, 2019లో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్ర మహిళా కమీషన్ చైర్‌పర్సన్‌గా అవకాశాలు కల్పిస్తే ఆమె ఇప్పుడు చేస్తున్న వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయన్నారు. అధికారం లేకుండా ఉండలేని మీరు పార్టీలు మారితే మారొచ్చు..కానీ గౌరవం ఇచ్చిన నాయకుడి మీద మాత్రం వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. స్వలాభం కోసం ఇలా మాట్లాడటం తగదని వాసిరెడ్డి పద్మకు హితవు పలికారు. కార్యక్రమంలో పెనుగంచిప్రోలు, వత్సవాయి ఎంపీపీలు మార్కపూడి గాంధీ, కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ సభ్యులు వూట్ల నాగమణి, ఏసుపోగు దేవమణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



అజ్మీరు శ్రీను



కె సుబ్రమణేశ్వరరావు

వత్సవాయి : మండల యూటీఎఫ్ శాఖ అధ్యక్షులుగా అజ్మీరు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. యూటీఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో యూటీఎఫ్ అధ్యక్షులుగా శ్రీనివాసరావు ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా కె. సుబ్రమణేశ్వరరావు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా యు.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఎస్‌కే జాని, సహాధ్యక్షురాలుగా ఎం.మణి, కోశాధికారిగా పి.రామకృష్ణ, కార్యదర్శులుగా ఎ.గోవిందరాజులు, జి.సునీల్‌బాబు, జి.కిరణ్మయి, వి.జ్యోతి, ఎంవీ నరసింహరావు, కేఆర్‌జే హెన్రీ, ఎం.బాబురావు, బీఎస్ఎన్ రెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా ఎ.శ్రీను, సుబ్రమణేశ్వరరావు, ఎస్‌బీ రషీద, పి.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి యూటీఎఫ్ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

మద్యంషాపు తొలగించాలంటూ సీఐకి వినతి

కంచికచర్ల: మండల కేంద్రం కంచికచర్లలో నేషనల్ హైవే పక్కన ఇళ్ల మధ్య ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలని ఆప్రాంత మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం కంచికచర్ల రూరల్ సీఐ డి.చవాన్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలకు ఎటువంటి అసౌకర్యం, ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ మద్యం షాపులను గ్రామాల బయట ఏర్పాటు చేసిందన్నారు. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్యం దుకాణాలను ప్రజలు నివసించే ప్రాంతాలు, విద్యార్థులు విద్యనభ్యసించే పాఠశాలల సమీపంలో ఏర్పాటు చేసిందంటూ ఆవేదన వ్యక్తంచేశారు. కంచికచర్ల నేషనల్ హైవే పక్కన ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని పలుశాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేశామని అయినా తమ గోడు ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. మందుబాబులు తాగిన మద్యంసీసాలను ఇళ్ల పరిసరాల్లోనే పడేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మద్యంషాపును అక్కడ్నుంచి తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు సీఐను కోరారు. విచారణ చేపట్టి ప్రజలకు ఇబ్బందిగా ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇచ్చారు. సీఐకి వినతిపత్రం అందజేసిన వారిలో కె.పద్మ, జి.వెంకటరమణ, గోగినేని భారతి, కె.ప్రసాద్, టి.బ్రహ్మం, తాళ్లపల్లి పద్మ, జె.వైష్ణవి తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కంచికచర్ల: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దారుఢ్యానికి ఎంతగానో దోహదపడుతున్నాయని ఆంధ్రా కబాడీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ పేర్కొన్నారు. కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలో ఐదు జిల్లాల సెంట్రల్ కబడ్డీ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని ఆల్‌దిబెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండురోజుల పాటు కళాశాలలో ఈ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి 47 టీములు పాల్గొంటున్నాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీ వంశీకిరణ్, జేఎన్‌టీయూకే అబ్జర్వర్ డాక్టర్ జీపీ రాజు, పీడీ నిమ్మగడ్డ శౌరయ్య, విద్యార్థులుపాల్గొన్నారు.

ఆర్డీఓకు వినతిపత్రం అందజేత

నందిగామ టౌన్:చందర్లపాడు మండలం కాండ్రపాడు గ్రామంలోని ఇళ్ల పట్టాల లేఅవుట్‌కు సంబంధించి పూర్తి విచారణ చేపట్టి వివాదాలకు తావులేకుండా ఇరువర్గాలకు న్యాయం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈమేరకు వారు గురువారం నందిగామ ఆర్డీఓ బాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు పూర్తి విచారణ చేపట్టాలని కోరారు.
లే అవుట్ వివాదంపై రెవెన్యూ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేసి, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఇరువర్గాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఆర్డీఓకు వినతిపత్రం అందజేసినవారిలో ఆపార్టీ నాయకులు శివకృష్ణారెడ్డి, సీతారామయ్య, శ్రీనివాసరావు, సాంబశివరావు, బాలకృష్ణ, వెంకట్రావు, వెంకటప్పారెడ్డి,శివనరసింహారావు ఉన్నారు.

ఆయుర్వేదంతో వ్యాధులు నయం



కొణకంచి(పెనుగంచిప్రోలు):ఆయుర్వేద వైద్యంతో అనేక దీర్ఘకాలిక వ్యాధులు కూడా నయమవుతాయని వైద్యాధికారి కె.వాణి తెలిపారు. జాతీయ ఆయుర్వేద వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి అందించిన వైద్యవిధానాన్ని వివరించారు. మన పరిసరాల్లో ఉన్న అనేక ఆయుర్వేద మొక్కలతో వ్యాధులను నయం చేయవచ్చని వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



కంచికచర్ల : అన్నిదానాల్లో రక్తదానానికి ప్రత్యేకమైన విశిష్టత ఉందని, రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కంచికచర్ల ఓసీ కళ్యాణ మండపంలో నందిగామ సబ్‌డివిజన్ స్థాయిలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఈ శిబిరంలో 450మంది రక్తదానం చేశారన్నారు. రక్తదాతలకు ఆయన సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ రక్తదానం ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. నందిగామ ఏసీపీ డాక్టర్ బి. రవికిరణ్, సీఐలు డి.చవాన్, వైవీఎల్ నాయుడు, జానకిరామ్, డివిజన్ పరిధిలోని ఎస్ఐలు బోనగిరి రాజు, శాతకర్ణి, అనిల్‌కుమార్, ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వరరావు, తోట సూర్యశ్రీనివాస్, అర్జున్, ఉమామహేశ్వరరావు, పోలీసు సిబ్బంది వైద్యులు, డ్వాక్రా సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.1ఖర్చుకు...రూ.10 కేటాయింపా?

మున్సిపల్ కౌన్సిలర్ల అభ్యంతరం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ హఫీజున్నీసా

జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల వచ్చిన వరద ముంపునకు సంబంధించి జేసీబీతో చేసిన పనులతోపాటు పలు వార్డుల్లో చేపట్టిన పునరావాస పనులకు వేసిన అంచనాలు హేతుబద్ధంగా లేనందున ఈవిషయంపై సబ్‌కమిటీ వేసి సమీక్షించాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ వరదనీరు తొలగింపు, డ్రైయిన్లలో పూడికతీత, కోతకు గురైన రోడ్లు తదితర రూ.9లక్షల విలువగల పనులను నామినేషన్ పద్ధతిలో ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగించారంటూ అభ్యంతరం వ్యక్తంచేశారు. అజెండాలోని 46అంశాల్లో 27అంశాలు వరదలకు సంబంధించినవే ఉన్నాయన్నారు. ఉదాహరణకు ఒక్క రూపాయి ఖర్చయ్యే పనికి పదిరూపాయలు చొప్పున కేటాయించారని ఆరోపించారు. ఈ కేటాయింపులపై సబ్‌కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు కళావేదిక చుట్టూత ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒకరి పేరున ఉన్న షాపును మరోవ్యక్తికి కేటాయించేలా చూస్తున్నారంటూ ఈ అంశంపై డీసెంట్ ఇస్తామని మరో వైస్ చైర్మన్ హఫీజున్నీసా పేర్కొన్నారు. కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి, పందుల రోశయ్య, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు, పలువురు కౌన్సిలర్లు ఆయా సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.